# టీచర్లకు సామర్థ్య పరీక్ష

- **స్కూలు అసిస్టెంట్లకు తప్పనిసరి**
- **ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ**

శ్రీకాళహస్తి, ఆగస్టు 9: విద్యా ప్రమాణాలు పెంచడానికి రాష్ట్ర విద్యాశాఖ నూతన సంస్కరణల బాట పడుతోంది. వచ్చే ఏడాది నుంచి జాతీయ అర్హతా ప్రవేశ పరీక్ష (నీట్) అమల్లోకి రానుంది. అలాగే ఈ విద్యా సంవత్సరం నుంచి పదో విద్యార్థులకు నిరంతర సమగ్ర మూల్యాంకన విధానంలో పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పద్ధతిలో పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడం, వారిలోని నైపుణ్యాలను మెరుగు పరచడానికి తొలుత టీచర్లను తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా టీచర్లకు సామర్థ్య పరీక్ష నిర్వహిస్తుంది. దీని ద్వారా వారి లోపాలను గుర్తించి.. బోధన సామర్థ్యాలను పెంచాలని భావిస్తోంది. టీచర్ల బోధనా సామర్థ్యాలను పరిశీలించడానికి "ట్రైనింగ్ నీడ్స్ ఐడెంటిఫికేషన్ టెస్ట్" (టీఎన్ఐఎఫ్) పేరుతో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు సంధ్యారాణి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని రకాల యాజమాన్యాల పరిధిలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు ఈ పరీక్ష తప్పనిసరిగా రాయాలి.

**పరీక్షల విధానమిదీ....**

గుంటూరు, కృష్ణా జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో ఈ నెల 20, 21 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లు ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. కృష్ణా పుష్కరాల నేపథ్యంలో ఈ కృష్ణా, గుంటూరు జిల్లాలకు వచ్చే నెల 10, 11 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. 2.30గంటలు. 50 మార్కులకు జనరల్ ప్రశ్నాపత్రం ఉంటుంది. ఇక సబ్జెక్టుకు సంబంధించి 100మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టుపై 6నుంచి 10వ తరగతి వరకు పాఠ్యాంశాల పైనా.. విషయ పరిజ్ఞానంపై 20 మార్కులు, మెథడాలజీపై 30 మార్కులకు పరీక్షా పత్రం ఉంటుంది. ప్రశ్నాపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఇక వ్యాయామ విద్య బోధించే ఉపాధ్యాయులకు సంబంధించి 50మార్కులకు జనరల్, 100 మార్కులకు వ్యాయామ విద్యపైనా ప్రశ్నాపత్రం ఉంటుంది. ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తున్నందున ఫలితాలు అప్పటికప్పుడే తెలిసి పోతాయి.